క్లుప్తంగా

ఓటుపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సెక్టోరల్ అధికారి మధుబాబు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కందుకూరు సచివాలయం ఎదుట ఓటు వేసే విధానం, ఓటును ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఓటు వేసినట్లు నిర్ధారించుకునే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. సచివాలయం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల ర్యాలీ

బి.కొత్తకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం బి.కొత్తకోటలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి జ్యోతిచౌక్ వరకు ర్యాలీ జరిగింది. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాలకు చెందిన వర్కర్లు హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో 9, 11 తరగతులు చదువుతున్న బాలికలకు బుధవారం పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం పీటీఎం సమీపంలోని బి.కొత్తకోట రోడ్డులో ఉన్న అస్లాం సిల్క్ ఇండస్ట్రీని బాలికలు సందర్శించారు. పట్టు సాగు, దారాలు తీసే విధానంపై అవగాహన కల్పించారు.

గార్మెంట్స్ పరిశ్రమలు స్థాపించాలి

బి.కొత్తకోట: కుట్టుపై ఆధారపడిన కార్మికుల కోసం ప్రభుత్వం బి.కొత్తకోటలో గార్మెంట్స్ పరిశ్రమలను స్థాపించాలని సిపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి కోరారు. బుధవారం జరిగిన టైలరింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడీమేడ్ దుస్తుల తయారీతో టైలర్లకు ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయన్నారు. టైలరింగ్ వృత్తితో కార్మికులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టైలర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఆజాద్‌బాషా, ఇమాం, రమణ, ఖాదర్‌బాషా, అరుణ,రవణమ్మ, రత్నమ్మ, రంగనాథ్, శ్రావణి పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

కలికిరి: మండల పరిధిలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జరిగిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని, సమావేశానికి ఉపాధి సిబ్బంది తగిన రికార్డులతో హాజరుకావాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కేవీపల్లె : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కేవీపల్లె జెడ్పీటీసీ గజ్జెల శృతి ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త క్యాలెండర్‌ను బుధవారం తిరుపతిలో మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని సమస్యలను మంత్రికి విన్నవించారు. మండలాభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, ఎలిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

మదనపల్లె సిటీ: తిరుపతిలోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంటర్ టెలికాం సర్వీసెస్ ఇండియా కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో మదనపల్లె ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. కె.హేమకిరణ్ సాయి, హేమతరుణ్ ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.2.4 లక్షలు ప్యాకేజీ ఇవ్వనున్నట్లు కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి తెలిపారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం

- టీడీపీ వస్తే పథకాలన్నింటిని రద్దు చేస్తారు
- పీలేరు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి


ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: రాష్ట్రంలోజగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితేనే ఇప్పుడిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, టీడీపీ అధికారంలోకి వస్తే ఇప్పుడిస్తున్న పథకాలన్నింటిని చంద్రబాబు తొలగిస్తాడని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం గుర్రంకొండ రెండవ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తాళింవీధిలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌కు ప్రారంభోత్సవం నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మహబూబ్ నగర్, టెలిఫోన్ ఎక్స్చేంజ్ వీధుల్లో మరుగునీటి కాలువలు నిర్మించాలన్నారు. తాళీం వీధిలో ఏళ్ల తరబడి అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారని, నూతన భవన నిర్మాణపనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టి తీసుకొచ్చారు. త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంత అప్పుల్లో ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని సంక్షేమ పథకాలను ఇస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మంచిమనసున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. మార్కెట్‌కమిటి చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, రెడ్డెమ్మకొండ చైర్మన్ నరసింహారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, ఎల్వీరమణ, మాజీ ఎంపీపీ జమీర్, సర్పంచ్‌లు గోపాల్‌నాయుడు,రౌనఖ్‌భాషా, సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజగోపాల్, కాదిర్, నాయకులు ప్రకాష్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నక్కామధు, సూరి, కుమార్, గయాజ్ అహ్మద్, శేఖర పాల్గొన్నారు.

క్రైస్తవులకు క్రిస్మస్ ఆనందం

సెమీ క్రిస్మస్‌లో పాస్టర్ ధనరాజ్

కురబలకోట: క్రీస్తు పుట్టిన క్రిస్మస్ యావత్ ప్రపంచ క్రైస్తవులకు ఆనందకరమని కల్లూరు చర్చి పాస్టర్ ధనరాజ్ పేర్కొన్నారు. స్థానిక గౌతమి నగర్‌లోని షాలేము చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్లకు, పాస్టరమ్మలకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఆయన వాక్యోపదేశం చేస్తూ దేవుడే మానవుడిగా ఈ లోకానికి అరుదెంచడం మానవాళికి వెలుగును ప్రసాదించిందన్నారు. క్రైస్తవ్యంలో ఒదిగి ఉంటేనే ఎదుగుదల ఉంటుందన్నారు. శాంతి, ప్రేమ, కరుణ, సంతోషానికి క్రిస్మస్ చిహ్నమన్నారు. దేవున్ని అనుసరించేవారికి దీవెనలు ఉంటాయన్నారు. ముఖ్యంగా ప్రార్థన ఊపిరి వంటిదన్నారు. ప్రార్థన లేని క్రైస్తవ జీవితాన్ని ఊహించలేమన్నారు. ఇది శోధనలో ప్రవేశించకుండా కాపాడుతుందన్నారు. నీతిమంతుల ప్రార్థన బలమైనదన్నారు. భయభక్తులతో నడచుకోవడమే క్రిస్మస్ సందేశమన్నారు. ఏసీఓ నరసింహులు, పాస్టర్లు సురేంద్ర రెడ్డి, అహరోను, టైటస్, సుధాకర్ రావు, శ్యాంసన్, డేవిడ్ శ్యామ్, బయ్యారెడ్డి, దినకర్, రాజు, ఆదినారాయణ, ప్రభావతమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కేవీపల్లె:మండలంలోని గుండ్రేవారిపల్లె చర్చి పాస్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని ఎంవీపల్లె గ్రామ సచివాయంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అలాగే కేవీపల్లెలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న ధనరాజ్


దైవ సందేశం ఇస్తున్న పాస్టర్

పీటీఎంలో హిందూ ధార్మిక సమ్మేళనం


జై శ్రీరామ్ నినాదాలు చేస్తున్న ప్రజలు

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, భజన బృందాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామ పుర వీధుల్లో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానికంగా ఉండే రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ప్రముఖ ఆశ్రమాలకు చెందిన పీఠాధిపతులు హాజరై జనవరి 22న అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా విగ్రహ ప్రతిష్ట శుభ ఘడియలను పురస్కరించుకుని గ్రామ, గ్రామాన ధార్మిక చైతన్యం కల్పించి హిందూ సమాజంలో విశ్వాసం నింపడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలి

పీలేరు : ప్రభుత్వ సంక్షేమపథకాలు యథావిధిగా కొనసాగాలంటే తిరిగి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం అజంతా మిట్ట, ఎల్‌బీఎస్ రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు చూసి మరోసారి జగన్‌ను ఆదరించాలని కోరారు. జెడ్పీ కో-ఆప్టెడ్ సభ్యుడు షఫీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, హబీబ్ బాషా, నాగభూషణం, సి.వి. రెడ్డి, మహేష్‌రెడ్డి, జావిద్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట మీదుగా సర్వీసు

కురబలకోట: మదనపల్లె నుంచి ఉదయం 7.40 గంటలకు కురబలకోట, తంబళ్లపల్లె మీదుగా తిమ్మమ్మ మర్రిమాను, కదిరి వరకు గురువారం నుంచి కొత్త ఆర్టీసీ సర్వీసు నడపనున్నట్లు వన్ డిపో మేనేజర్ వెంకట్రమణారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో ఈ సర్వీసును నడుపుతున్నట్లు తెలిపారు. సాయంత్రం కూడా ఐదు గంటలకు తంబళ్లపల్లె నుంచి బయలు దేరి కురబలకోట మీదుగా మదనపల్లె చేరుతుందన్నారు. కురబలకోట ఊరి ప్రజలకు సౌకర్యంగా ఎమ్మెల్యే ఈ బస్సు సర్వీసును పునరుద్ధరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు

మదనపల్లె సిటీ: మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 26న ఉదయం 9 గంటలకు బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సులకు రాను,పోను రూ.805 చెల్లించాలన్నారు. వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని సూచించారు.

కలసికట్టుగా అభివృద్ధి చేద్దాం

- మండలమీట్‌లో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ
- నిందితులకు సహకరించవద్దన్న డీఎస్పీ ప్రశాంత్
- ఆర్టీసీ బస్సుల తీరుపై ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీనరసమ్మ

బి.కొత్తకోట: మండల అభివృద్ధికి అందరం కలసికట్టుగా పనిచేద్దామని ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అన్నారు. బుధవారం ఆమె అధ్యక్షతన బి.కొత్తకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో మండలం అభివృద్ధి సాధిస్తోందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. స్టేషన్ డీఎస్పీ ప్రశాంత్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను ప్రజాప్రతినిధులు సహకరించరాదని కోరారు. కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసినప్పుడు వారిని వదిలేయాలంటూ ఒత్తిళ్లు తీసుకురావడం తప్పన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. ఇలాంటి విషయాలపై సహకరించేది లేదని స్పష్టం చేశారు. బి.కొత్తకోటలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ రామచంద్ర మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి 8 గంటలు దాటితే మదనపల్లెకు బస్సులు లేవని, దీనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆర్టీసీ సిబ్బందిపై ఆగ్రహించారు. వచ్చే సమావేశాలకు డీఎం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, ప్రత్యేక ఆహ్వానితులు అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. వివిధశాఖలకు చెందిన అధికారులు తమశాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. తుమ్మనంగుట్ట సర్పంచు రుక్మిణీ మాట్లాడుతూ సమావేశానికి సగం మంది అధికారులు హాజరుకాలేదన్నారు. అధికారులే రానప్పుడు సమస్యలు ఎవరి దృష్టికి తీసుకెళ్లాలని ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీఓ శంకరయ్య స్పందిస్తూ మండల సమావేశానికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బి.నాగిరెడ్డి, బి.జయరామిరెడ్డి, గిరిజ, సాంబశివ, వెంకటరమణ, చంద్ర, సరస్వతమ్మ, ఉమామహేశ్వరీ, ఆదెప్ప, ఎస్.రామక్క, ఎం.రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు వి.రామసుబ్బారెడ్డి, సి.యల్లప్ప, సి.విమలమ్మ, ఎ.సుబ్బారాయప్ప, ఎ.గౌతమి, బి.ఈశ్వరమ్మ, ఎ.రమాదేవి, అధికారులు హాజరయ్యారు.

ప్రకృతి వ్యవసాయ పంటలపై క్షేత్ర పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న మహిళా సమైక్య బృందం

వాల్మీకిపురం: మండలంలోని అయ్యవారిపల్లిలో ప్రకృతి వ్యవసాయ పొలాలను ఏపీఎం నరసింహులు, డైరీ ఏపీఎం సుజాత బుధవారం పరిశీలించారు. సీసీలు శ్రీనివాసులు, శంకరయ్య, మహేశ్వరి, వెలుగు మండల సమైక్య అధ్యక్షురాలు భూదేవి, ప్రధాన కార్యదర్శి దేవయాని, కోశాధికారి నందిని బృందంగా ఏర్పడి రైతులు సాగు చేసిన ఏటీఎం మోడల్ ఏ గ్రేడ్ మోడల్, ఘన, ద్రవ జీవామృతం డెమోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ వివిధ పంటలతో పది రోజుల నుంచి 20 సంవత్సరాల వరకు పంటలు వచ్చే మొక్కలని ఒకే పొలంలో సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనం చేకూరుతుందని రైతులు క్షేత్ర సందర్శన బృందానికి తెలిపారు. రసాయన ఎరువులు, రసాయన పురుగుమందులు వాడకుండా పంటలు పండించడం చాలా సులువు అని, ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయడం ప్రకృతిని కలుషితం చేయకుండా పంటలు సాగు చేయడం ఎంతో ఆనందకరమని మహిళా సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవోఏ లక్ష్మీదేవి, మాస్టర్ ట్రైనర్లు సుబ్బరామయ్య, వెంకట జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


తంబళ్లపల్లె: తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ నాగవేణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులైన వివాహితులు అర్హులన్నారు. పదోతరగతి పాసై, 21-35 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓహెచ్ కేటగిరీ వారు సదరన్ క్యాంపు సర్టిఫికెట్లు ధృవీకరణ పత్రాలతో కచ్చితంగా ఇవ్వాలన్నారు. ఈనెల 23వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సర్టిఫికెట్లతో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు సీడీపీఓ ఆఫీసులో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

వాల్మీకిపురం: స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు స్థానిక ఆర్ఎంఎం కింగ్ ప్యాలెస్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు హసీం, మెహబూబ్ అలి, సయ్యద్‌బాషా, కౌసర్, షంషాద్ తదితరులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. 23 ఏళ్ల తరువాత విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు అందరూ ఒకే చోట కలవడంతో వారిలో సంతోషాలు వెల్లివెరిశాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి సహపంక్తి భోజనాలు చేస్తూ అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆహ్లాదకరంగా గడిపారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు ముజీర్, షాహెద్, నాసీర్, సర్దార్, సాధిక్, హసీఫా, కౌసర్, ఫరీదా, ముబీనా, గౌసియా, తాజీం, జబ్బీన్, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు హర్షవర్ధన్ రెడ్డి


హర్షవర్ధన్ రెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: జాతీయ స్థాయి హాకీ పోటీలకు మదనపల్లె పట్టణం దీక్ష పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యారు. మదనపల్లెలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల,బాలికల పోటీల్లో ప్రతిభ చూపారు. ఈనెల 28 నుంచి జనవరి 1వతేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ఆడనున్నారు. హర్షవర్ధన్ రెడ్డిని పాఠశాల చైర్మన్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపల్ నాగార్జున, పీడీ నౌషాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ పురుషోత్తం

కురబలకోట: యువత మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం కోరారు. బుధవారం అంగళ్లు దగ్గరున్న విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం..పర్యవసానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెడు అలవాట్లు చదువు సంధ్యలను వెనుకబడేలా చేస్తాయన్నారు. మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి, సీఐ శివాంజనేయులు, ఎంఈఓ ద్వారకనాథ్ పాల్గొన్నారు.

నిరుపేదల గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కేవీపల్లె :మండలంలోని మఠంపల్లె పంచాయతీ కలికిరివాండ్లపల్లెలో నివాసం ఉన్న నిరుపేదల గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, గిరిజన సమైక్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి విశ్వనాథ్‌నాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృతతేజ వివిధ సంఘాల నాయకులు శ్రీకాంత్, శివ, గిరి, రమణ, చెంగమ్మ తదితర గిరిజనులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

కురబలకోట: కురబలకోటలో కలెక్టర్‌చే బుధవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడినట్లు తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రపై రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్సు ఉండడంతో ఇది వాయిదా పడినట్లు తెలిపారు.

బినామీ ఏజెన్సీలను రద్దు చేయాలి

మదనపల్లె సిటీ: మదనపల్లె బ్రాంచి ఎల్ఐసీ కార్యాలయంలో సబ్ స్టాఫ్‌గా పని చేస్తున్న శ్రీకాంత్, ప్రతాప్, శ్రీనివాసులు భార్యల పేరు మీద తీసుకున్న బినామీ ఏజెన్సీలను రద్దు చేయాలని ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, రామమోహన్ అన్నారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వీరు బ్రాంచిలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏజెంట్లకు వచ్చే వ్యాపారాన్ని పక్కదారి పట్టిస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తమ కడుపుకొడుతున్న వీరిపై ఎల్ఐసీ ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో నీటికి కటకట


నీటి సమస్యను వివరిస్తున్న రోగి సహాయకురాలు

మదనపల్లె : జిల్లా ఆస్పత్రిలో నీటికి కటకట ఏర్పడింది. ఆస్పత్రి మొత్తానికి నీటిని సరఫరా చేసే ఒక్కగానొక్క బోరు అధిక వినియోగంతో ఎండిపోవడంతో కష్టాలు మొదలయ్యాయి. ఆస్పత్రిలోని రోగుల సహాయకులు నీళ్ల కోసం బాటిల్స్ పట్టుకుని బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజువారీ అవసరాలకు జిల్లా ఆస్పత్రికి సుమారుగా రోజుకు 10 ట్యాంకర్ల వరకు నీటి అవసరం ఉంది. మండలంలోని ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణపనులు ఆలస్యమవుతుండటంతో, ఈ ఏడాది జిల్లా ఆస్పత్రిలోనే కళాశాల తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం ఆస్పత్రిపై భాగంలో అదనపు భవన నిర్మాణం చేపట్టింది. ఈ నిర్మాణపనులకు సైతం ఆస్పత్రి బోరు నుంచే నీటివినియోగం చేస్తున్నారు. ఈ క్రమంలో బోరు ఎండిపోవడంతో బుధవారం ఉదయం నుంచి ఆస్పత్రిలో ఎక్కడా నీటిచుక్క లేక రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్ పద్మాంజలిదేవి, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి తాత్కాలికంగా 3 ట్యాంకర్ల నీటిని తెప్పించారు. ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ట్యాంకర్లతోనైనా సరిపడా నీటిని సరఫరా చేయాలని రోగులు కోరుతున్నారు.

స్థల పరిశీలన చేసిన జడ్జి


కోర్టు ప్రాంగణంలో జడ్జితో న్యాయవాదులు

మదనపల్లె : స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో జిల్లా జడ్జి భీమరావు స్థలపరిశీలన చేశారు. బుధవారం స్థానిక కోర్టును పరిశీలించిన ఆయనకు మహిళా న్యాయవాదులు తమకు ప్రత్యేక గది అవసరం ఉందని ఆయన దృష్టికి తెచ్చారు. వారి విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న ఆయన కోర్టు ప్రాంగణంలోని స్థలంతో పాటు ప్రస్తుత బార్ అసోసియేషన్ గదిపై స్థలాన్ని సైతం పరిశీలించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి త్వరలోనే మహిళా న్యాయవాదులకు గది ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. ఆయనతో పాటు రెండో అదనపు జిల్లా జడ్జి అబ్రహాం, న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.